సాక్షి నాగర్‌కర్నూల్

బుధవారం ၊ 31 ၊ జనవరి ၊ 2024

బాధ్యులెవరు..?

- మాయల మాంత్రికుడి బాగోతాలను వెలుగులోకి తెస్తున్న బాధితులు
- ఇప్పటివరకు 11 మందిని పొట్టనబెట్టుకున్న సత్యనారాయణయాదవ్
- ఎట్టకేలకు నిందితుడికి సహకరించిన సీఐ హన్మంతుపై సస్పెన్షన్ వేటు
- సత్యనారాయణతో సీఐ సంబంధాలపై గతంలోనే వెల్లడించిన 'సాక్షి'



- వివరాలు 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
33.1 /11.5

వాతావరణం
ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ప్రభావం ఉంటుంది.

సర్వతోముఖాభివృద్ధికి కృషి

- అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలి
- విద్య, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యం
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- అన్ని శాఖలపై చర్చ అభినందనీయం: జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, కలెక్టర్ ఉదయ్‌కుమార్, అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

నాగర్‌కర్నూల్: జిల్లా సర్వతోముఖాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషిచేయాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నీటి పారుదల, మిషన్ భగీరథ, పీఆర్, ప్రొహిబిషన్, ఎక్సైజ్, అటవీ, విద్యుత్, విద్య, వైద్య, గనులు, భూగర్భ, ఖనిజాలు, వ్యవసాయ శాఖలపై సభలో చర్చించారు. ముందుగా విద్యా శాఖపై చర్చ సందర్భంగా మంత్రి జూపల్లి కీలక సూచనలు చేశారు. జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ప్రజలు కలిస్తే గురుకుల స్థాయి విద్యను ప్రభుత్వ పాఠశాలల్లోనే అందించవచ్చన్నారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. విద్యుత్ శాఖ సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మన్ననూర్ నుంచి వట్వర్లపల్లి వరకు వేలాడుతున్న విద్యుత్ తీగలను మార్చేందుకు ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. గత ఐదారేళ్లలో మంజూరైన సబ్‌స్టేషన్లు, ఇప్పటి వరకు పూర్తయినవి, వ్యవసాయ బోరు బావులకు రైతులు కట్టిన డీడీలు, ఎన్ని కనెక్షన్లు ఇచ్చారు, పెండింగ్‌లో ఉన్నవి, గ్రామాల్లో ఇళ్ల పైనుంచి వెళ్తున్న లైన్ అలైన్‌మెంట్ మార్చాల్సిన వాటికి ప్రతిపాదనలతో పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. ఇరిగేషన్, మిషన్ భగీరథ, విద్యుత్ తదితర కీలక శాఖలపై ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి, విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి అవాంతరాలు లేకుండా చూడాలని కోరారు. సభ సజావుగా జరగడం, దాదాపు అన్ని శాఖలపై చర్చించడం అభినందనీయమన్నారు.

బెల్టు షాపులను మూసేయాలి



అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అమ్రాబాద్ మండలంలోని ఉర్దూ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని దీనిని అధిగమించడానికి ఇతర ప్రాంతాల నుంచి ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమిస్తే.. వారికి అవసరమైన వసతి ఉచితంగా కల్పిస్తామన్నారు. అలాగే గ్రామాల్లో బెల్ట్ షాపులను క్రమంగా నిషేధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గుడుంబా, మాదక ద్రవ్యాల సరఫరాపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోడు భూముల్లో ఏళ్లతరబడిగా సాగులో ఉన్న వారిని గుర్తించి హక్కు పత్రాలు ఇవ్వాలని, రాయవరం, క్యాంప్ రాయవరం వంటి ప్రాంతాల్లో అర్హత లేని వారికి ఇప్పటికే ఇచ్చి ఉంటే వాటిని రద్దు చేయాలని సూచించారు.

❒ కలెక్టర్ ఉదయ్‌కుమార్ స్పందిస్తూ రాయవరం, క్యాంప్ రాయవరం ప్రాంతాల్లో అనర్హులకు పోడు భూమి హక్కు పత్రాలు ఇవ్వలేదని చెప్పారు. ఆర్ఓఎఫ్ఆర్ ప్రకారం ఇది నిరంతర ప్రక్రియ అని, ఎవరైనా సరైన ఆధారాలు చూపించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

❒ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖకు సంబంధించి రైతుల నుంచి భూ సేకరణ చేసిన టోకెన్లు రూ.37 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకా సర్వే చేయాల్సినవి సైతం చాలా ఉన్నాయని చెప్పారు. రూ.37 కోట్ల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే రానున్న వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు.

❒ పదర జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు మాట్లాడుతూ మండలంలో సెల్‌టవర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, అలాగే జోత్యానాయక్‌తండా, చెన్నంపల్లి, పిల్లిగుండు ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి మాట్లాడుతూ ఇటీవల జియో నెట్‌వర్క్ సెల్‌టవర్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చామన్నారు. నిబంధనల ప్రకారం అటవీ శాఖకు జమ చేయాల్సిన కొంత డబ్బును చెల్లించిన వెంటనే నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తుందన్నారు.

❒ కొల్లాపూర్ జెడ్పీటీసీ సభ్యుడు జూపల్లి భాగ్యమ్మ మాట్లాడుతూ ముక్కిడిగుండంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ తొలగించి తాగునీరు లేకుండా చేశారని సభ దృష్టి తెచ్చారు. స్పందించిన మిషన్ భగీరథ అధికారి అక్కడ వంతెన నిర్మిస్తుండటం వల్లే తొలగించామని, త్వరలోనే పైప్‌లైన్ పునరుద్ధరిస్తామన్నారు.

❒ నాగర్‌కర్నూల్, తిమ్మాజీపేట జెడ్పీటీసీ సభ్యులు శ్రీశైలం, ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖలో సర్పంచ్‌లు పనులు పూర్తి చేసినా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. మన ఊరు–మన బడి కింద చేసిన పనులకు సైతం బిల్లులు రాలేదన్నారు. తిమ్మాజిపేట డిస్ట్రిబ్యూషన్ కెనాల్‌కు భూమి సేకరించి పనులు చేపట్టాలన్నారు. స్పందించిన అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ అగ్రిమెంట్ చేసుకొని పనులు పూర్తి చేసిన వాటికి వెంటనే ఎంబీ పూర్తి చేసి బిల్లులు చేయాలని పీఆర్ ఇంజినీర్‌ను ఆదేశించారు.

❒ అచ్చంపేట జెడ్పీటీసీ సభ్యుడు మంత్రియానాయక్ మాట్లాడుతూ అచ్చంపేట ట్రైబల్ స్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారని ఆరోపించారు. లంబాడీలపై మాత్రమే సారా తయారు చేస్తున్నారని కేసులు పెడుతున్నారని, బెల్లం అమ్మేవారిని, కల్తీ కల్లు తయారు చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గిరివికాసం కింద అచ్చంపేటలో 32 బోరు బావులు మంజూరైతే 8 బోర్లకు మాత్రమే విద్యుత్ కనెక్షన్ ఇచ్చారన్నారు.

❒ పెద్దకొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు గౌరమ్మ మాట్లాడుతూ పెద్దకార్పాముల రైతులకు మంజూరైన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, 80 స్తంభాలను విద్యుత్ శాఖ ఏఈ అక్రమంగా కుమ్మెర గ్రామానికి అమ్ముకున్నారని ఆరోపించారు. స్పందించిన మంత్రి విచారణ చేసి పూర్తి నివేదిక ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. సమావేశంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, అన్ని మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అటవీ అధికారులకు శిక్షణ



మన్ననూర్: దూలపల్లి ఫారెస్టు అకాడమీ పదో బ్యాచ్ మహారాష్ట్రకు చెందిన 35 మంది ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ క్యాడర్ అధికారులు ఏటీఆర్‌లో ఐదురోజులపాటు శిక్షణ కోసం మంగళవారం మన్ననూర్‌కు చేరుకున్నారు. అనంతరం ఫర్హాబాద్ నుంచి అటవీ మార్గం గుండా భౌరాపూర్ సమీపంలోని దేవుని సరిఒడ్డు అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బొటానికల్, వన్య ప్రాణులు, పాములు, అడవుల ప్రాధాన్యతకు సంబంధించి పలు విషయాలను అధ్యాపకుడు సదాశివయ్య శిక్షణ అధికారులకు వివరించారు. ఐదు రోజులపాటు అటవీ ప్రాంతంలోనే ఉంటూ శిక్షణ పూర్తి చేయడం జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో దూలపల్లి రేంజ్ ఆఫీసర్ వంశీకృష్ణ, ఎఫ్ఎస్ఓలు ముజీబ్, రామాంజనేయులు, గురువయ్య, బాబలి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు రెఫరీగా రామన్‌గౌడ్



నాగర్‌కర్నూల్ క్రైం: హైదరాబాద్‌లో గురువారం నుంచి ఆదివారం వరకు జరిగే 49వ జాతీయస్థాయి జూనియర్ నేషనల్ బాల, బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ నుంచి రామన్‌గౌడ్‌ను రెఫరీగా నియమించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు రెఫరీగా వెళ్లనున్న రామన్‌గౌడ్‌ను జిల్లా కార్యదర్శి యాదయ్యగౌడ్, పాండు, సభ్యులు సీతారాం, ప్రసాద్, శేఖర్‌బాబు అభినందించారు.

వసతి గృహాల్లో పారిశుద్ధ్యం లోపించొద్దు



మన్ననూర్: ప్రభుత్వ వసతి గృహాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అచ్చంపేట ఆర్డీఓ గోపిరాం నిర్వాహకులకు సూచించారు. మన్ననూర్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులం, గిరిజన ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాల పరిసరాలను అమ్రాబాద్ తహసీల్దార్ శ్రీనాథ్‌తో కలిసి మంగళవారం ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వాహకులకు విద్య, విద్యార్థుల ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో రాణించగలుగుతారనేది గమనించాలన్నారు. అందుకు గాను ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతినిత్యం పౌష్టికాహారం అందించాలన్నారు. సాంఘిక సంక్షేమ పాఠశాల వసతి గృహంలో పరిసరాలు అస్తవ్యస్తంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే వసతి గృహం, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వసతులు, విద్యాపరమైన సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.

సీపీఆర్, ప్రథమ చికిత్సపై అవగాహన పెంచుకోవాలి

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యార్థులు సీపీఆర్, ప్రథమ చికిత్సపై అవగాహన పెంచుకుని ఆపదలో ఉన్నవారిని రక్షించాలని జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి రమేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని నెల్లికొండ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్, ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై అవగాహన పెంచుకుంటే అత్యవసర సమయాల్లో ఆపదలో ఉన్నవారిని ఎలా రక్షించాలనే విషయాలు తెలుస్తాయన్నారు. యూత్ రెడ్‌క్రాస్ రాష్ట్ర కోఆర్డినేటర్ రమణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ కుమార్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జంతు సంరక్షణ.. అందరి బాధ్యత

నాగర్‌కర్నూల్: జంతువుల సంరక్షణ మన అందరి బాధ్యత అని జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో పశు సంవర్ధక శాఖకు సంబంధించిన జంతు సంరక్షణ వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతువుల సంరక్షణతోపాటు వాటికి హాని కలిగించకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జంతువుల ఆరోగ్య సమస్యల పట్ల రైతులకు పశుసంవర్ధక శాఖ అధికారులు అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వం అందించే పథకాలను వారి జీవనోపాధికి, అభివృద్ధి చెందే విధంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ సానుభూతి, ప్రేమానురాగాలను పంచేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని రాష్ట్ర ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ మానిటరింగ్ అధికారి రవికుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యానికి గురైన వారికి బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధులు ఉన్న వారికి ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందజేయడంతోపాటు వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఫోం బోర్డులు ఏర్పాటు చేసి దీర్ఘకాలిక రోగుల వివరాలు ఉంచాలని చెప్పారు.

ఉమ్మడి జిల్లాలో ఎస్‌ఐలకు స్థానచలనం

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మరోమారు 21 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

ఎస్‌ఐ	ప్రస్తుత స్థానం	బదిలీస్థానం
ఎం.చంద్రకాంత్	వీఆర్, మహబూబ్‌నగర్	మానవపాడు
కొందూరు రాము	మానవపాడు	డీఎస్‌బీ జోగులాంబ గద్వాల
జగదీశ్వర్‌రెడ్డి	పెబ్బేరు	వీఆర్ జోగులాంబ గద్వాల
ఎంఏ ఖదీర్	వీఆర్ జోగులాంబ గద్వాల	డీఎస్‌బీ జోగులాంబ గద్వాల
ఎం.సంతోష్	వీఆర్ వనపర్తి	శాంతినగర్
వి.వెంకటేష్	కేటీదొడ్డి	ఇటిక్యాల
పి.అశోక్‌బాబు	ఇటిక్యాల	వీఆర్ మహబూబ్‌నగర్
సి.కుర్మయ్య	నర్వ	కొండాపూర్
పి.కృష్ణదేవ్	కొండాపూర్	వీఆర్ నారాయణపేట
ఎ.నాగరాజు	డీసీఆర్‌బీ మహబూబ్‌నగర్	అలంపూర్
ఎం.రమేష్	అలంపూర్	డీఎస్‌బీ జోగులాంబ గద్వాల
కె.శ్రీనివాసులు	మూసాపేట	ఉండవెల్లి
బి.హరిప్రసాద్	పెద్దమందడి	గోపాల్‌పేట
ఎస్‌కే శంషోద్దీన్	ఎస్‌ఐ ట్రాఫిక్ మహబూబ్‌నగర్	శ్రీరంగాపూర్
వెంకటస్వామి	శ్రీరంగాపూర్	వీఆర్ మహబూబ్‌నగ్
బి.వెంకటేశ్వర్లు	గోపాల్‌పేట	వీఆర్ వనపర్తి
వి.జయన్న	ఎస్‌ఐ-2, వనపర్తి టౌన్	ఎస్‌ఐ-1 వనపర్తి టౌన్
జి.యుగేందర్	ఎస్‌ఐ-1 వనపర్తి టౌన్	వీఆర్ వనపర్తి
ఈ.శివకుమార్	రేవల్లి	పెద్దమందడి
పి.జలేందర్‌రెడ్డి	డీఎస్‌బీ వనపర్తి	వనపర్తి రూరల్
కర్నె శేఖర్‌రెడ్డి	బల్మూరు	రేవల్లి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీపై విచారణ జరిపించాలి



నాగర్‌కర్నూల్ క్రైం: దళితబంధు పథకంలో రూ.కోట్లు దోచుకొని నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేసిన జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ రాంలాల్‌పై విచారణ జరిపి అక్రమంగా దోచుకున్న దళితబంధు నిధులను తిరిగి రికవరీ చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మ జ్యోతిబా పూలే ప్రగతిభవన్‌లో ప్రజాదర్బార్ సందర్భంగా రాష్ట్ర అధికారులకు మాల మహానాడు బృందం ఎస్సీ కార్పొరేషన్ ఈడీపై ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో అచ్చంపేట నియోజకవర్గం చారకొండ మండలంలో 1,407 యూనిట్లు మంజూరు అయితే అందులో దాదాపు 60 శాతానికి పైగా బోగస్ యూనిట్ల పేరుతో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి రూ.కోట్లు అక్రమంగా దోచుకున్నారని ఆరోపించారు. ట్రాన్స్‌పోర్టు, సర్వీస్ సెక్టార్ల కింద మంజూరైన లబ్ధిదారుల జాబితాలో అనర్హులను కేటాయించి వారి నుంచి రూ.లక్ష చొప్పున లంచం తీసుకొని ఏజెన్సీలతో కుమ్మక్కై దళితబంధును నిర్వీర్యం చేసిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాంలాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

త్యాగధనులను స్మరించుకోవాలి



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, సీతారామారావు తదితరులు

నాగర్‌కర్నూల్: దేశ స్వాతంత్య్రం కోసం పోరాడి ప్రాణాలర్పించిన అమరుల ఆశయాల సాధన దిశగా పౌరులంతా కృషిచేయాలని అదనపు కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం షహీద్ దివస్‌ను పురస్కరించుకొని స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, సిబ్బంది 2 నిమిషాలు మౌనం పాటించి దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించి అమరులైన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన అమరులను యువత ఆదర్శంగా తీసుకోవడమే కాకుండా వారిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి త్యాగంతోనే స్వేచ్ఛాయుత దేశంలో జీవిస్తున్నామని చెప్పారు. అమరుల త్యాగాలు ఎంతో గొప్పవని, వారి ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జిల్లా అధికారులు నర్సింగ్‌రావు, సీతారాం, పత్యానాయక్, శ్రీనివాస్‌బాబు, కమలాకర్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు జాకీర్ అలీ, కార్తీక్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన

నాగర్‌కర్నూల్: ఓటర్లు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం)పై అవగాహన కలిగి ఉండాలని అదనపు కలెక్టర్ సీతారామారావు అన్నారు. మంగళవారం ఆయన ఈవీఎంలను గోదాం నుంచి తరలించే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, కంట్రోల్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ల గురించి తెలుసుకోవడానికి అచ్చంపేట, కొల్లాపూర్ ఆర్డీఓ కార్యాలయాలతోపాటు కలెక్టరేట్‌లో అవగాహన కేంద్రాలను బుధవారం నుంచి అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి క్షేత్రస్థాయిలో ప్రచారం చేస్తామన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. అనంతరం మాక్ పోలింగ్ నిర్వహించి తాము వేసిన ఓట్లను పరిశీలించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జాకీర్‌అలీ, డిప్యూటీ తహసీల్దార్ రఘు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వసతులు అరకొరే..

జనరల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినా సౌకర్యాలు కరువు

- నేటికీ నియామకానికి నోచుకోని అభివృద్ధి కమిటీ
- ట్రామా సెంటర్ ఏర్పాటులోనూ తీవ్ర జాప్యం





నాగర్‌కర్నూల్‌లోని జనరల్ ఆస్పత్రిలో టీఫా స్కానింగ్ కోసం తరలివచ్చిన గర్భిణులు (ఫైల్)

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జనరల్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసినా ఆ స్థాయి సౌకర్యాలు మాత్రం సమకూరడం లేదు. జనరల్ ఆస్పత్రి ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు కనీసం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు కాకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిర్వహణ, పర్యవేక్షణలో కీలకంగా వ్యవహరించే అభివృద్ధి కమిటీ ఏర్పాటుపై అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో జనరల్ ఆస్పత్రి స్థాయి సౌకర్యాలకు నోచుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాకేంద్రానికి ప్రభుత్వ మెడికల్ కళాశాల మంజూరు, ప్రభుత్వ ఆస్పత్రిని జనరల్‌గా అప్‌గ్రేడ్ చేసిన తర్వాత స్పెషాలిటీ స్థాయి వైద్యం అందరికీ అందుబాటులోకి రావాల్సి ఉంది. అయితే జనరల్ ఆస్పత్రిగా మారి రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటికీ సాధారణ ఓపీ సేవలకే పరిమితం కావడంతో ఆస్పత్రికి వస్తున్న రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అభివృద్ధిలో కీలక పాత్ర

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి నిర్వహణ, అభివృద్ధి, నిధుల మంజూరు, సౌకర్యాల పెంపుదలకు అభివృద్ధి కమిటీ పాత్ర కీలకం. అయితే జనరల్ ఆస్పత్రిగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయలేదు. మంత్రి, జెడ్పీచైర్మన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఇతర ఉన్నత స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉండే ఈ కమిటీలో ఆస్పత్రిలో కల్పించే మెరుగైన సౌకర్యాలపై నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. తర్వాత ఎప్పటికప్పుడు చేపట్టాల్సిన పనులు, అందుకు సదుపాయాలను సమకూర్చడంలో అభివృద్ధి కమిటీ తోడ్పాటునందించనుంది. అయితే ఇప్పటి వరకు అభివృద్ధి కమిటీ ఊసే లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రయత్న లోపం..

జిల్లావ్యాప్తంగా నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను ఆస్పత్రి వరకు తరలించే లోపే చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో ట్రామా సెంటర్ల ఏర్పాటుతో క్షతగాత్రులకు తక్షణ చికిత్స అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ఆస్పత్రిని జనరల్‌గా అప్‌గ్రేడ్ చేసిన తర్వాత ట్రామా సెంటర్‌ను అందుబాటులోకి తేవాల్సి ఉండగా.. ఇప్పటి వరకు ఆ దిశగా ప్రయత్నాలు కూడా చేయడం లేదు.

రోగులకు తప్పని తిప్పలు

జనరల్ ఆస్పత్రిలో ఇటీవల గర్భిణుల కోసం టీఫా స్కానింగ్ సేవలు అందుబాటులోకి వచ్చినా.. నిత్యం అందడం లేదు. వారంలో రెండు, మూడు రోజుల్లో మాత్రమే వారికి స్కానింగ్ సేవలు అందిస్తున్నారు. దీంతో ఆ సమయాల్లో రద్దీ నెలకొంది. జనరల్ ఆస్పత్రిలో ఇప్పటి వరకు సీటీ స్కానింగ్ సేవలు అందుబాటులో లేక ప్రైవేట్ ఆస్పత్రులు, ఇతర స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి పరీక్ష చేసుకోవాల్సి వస్తోంది. జనరల్ ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్ అందుబాటులోకి వచ్చినా ఇందుకు సంబంధించిన ఫిల్మ్ కొరతతో రోగుల రద్దీకి అనుగుణంగా సేవలు అందడం లేదు. గర్భిణులకు ప్రసూతి సేవల కోసం కనీసం ఆరుగురు గైనకాలజిస్టులు అవసరం ఉండగా.. ప్రస్తుతం నలుగురితోనే నెట్టుకొస్తున్నారు.

స్పెషాలిటీ సేవలకు దూరం

జనరల్ ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ విభాగంలో శస్త్రచికిత్సలు లేవు. జనరల్ ఆసుపత్రి స్థాయిలో డెంటల్, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, కార్డియాలజీ, రేడియాలజీ సేవలు అందాల్సి ఉండగా ఇంకా ఏర్పాటు కాలేదు. ఆప్తమాలజీ సేవలు నిరంతరం కొనసాగడం లేదు. రోగులకు స్పెషాలిటీ సేవలు అందక కేవలం ఓపీకే పరిమితమవుతున్నాయి.

ప్రతిపాదనలు పంపాం..

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరలోనే ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం కమిటీని ఏర్పాటు చేస్తాం. అలాగే సూపర్ స్పెషాలిటీ స్థాయి సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నాం. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– రఘు, సూపరింటెండెంట్, జనరల్ ఆస్పత్రి

రూ.2,500 ఖర్చయింది..



నేను ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు గాయాలయ్యాయి. జనరల్ ఆస్పత్రికి వస్తే వైద్యులు సీటీ స్కాన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ లేక ప్రైవేట్ స్కానింగ్ సెంటర్కు వెళ్తే రూ.2,500 ఖర్చయింది. జనరల్ ఆస్పత్రిలో త్వరగా సీటీ స్కాన్ ఏర్పాటు చేస్తే పేదలకు మేలు జరుగుతుంది.

– బాలయ్య, పోతిరెడ్డిపల్లి, తిమ్మాజిపేట మండలం

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

జడ్చర్ల: మండలంలోని నక్కలబండ తండా చెరువు కట్టపై వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. మిడ్జిల్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన రాఘవేందర్(35)గా మృతున్ని గుర్తించారు. మృతి చెంది మూడు రోజులకు పైగా అయినట్లు పేర్కొన్నారు. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా ఉండడంతో తాగి ఆత్మహత్య చేసుకున్నాడని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

సెల్‌ఫోన్ కోసం ఆత్మహత్యాయత్నం

- చికిత్స పొందుతూ వివాహిత మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్ఐ రాంచందర్‌జీ వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని ఎండబెట్లకు చెందిన పద్మమ్మ(38) తనకు సెల్‌ఫోన్ ఇప్పించాలని భర్త ధర్మయ్యను అడిగింది. సెల్‌ఫోన్ విషయంలో ఇరువురి మధ్య గొడవ చోటుచేసుకుంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి క్షణికావేశానికి గురై ఆమె ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమె వెంటనే జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా.. కుటుంబ సభ్యులు అవయవదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. నాగర్‌కర్నూల్‌కు చెందిన చిదిరే సాయితేజ(19) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. ఇతను ఈ నెల 26న కళాశాల నుంచి ద్విచక్రవాహనంపై హాస్టల్‌కు వెళ్తున్న క్రమంలో ఇబ్రహీంపట్నం వద్ద మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు పుట్టెడు దుఃఖంలోనూ సాయితేజ అవయవాలను యశోద ఆస్పత్రికి దానం చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్‌కు తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అవయవ దానంతో పలు వురి ప్రాణాలు కాపాడటానికి సహకరించిన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

చికిత్సపొందుతూ వ్యక్తి..


వెంకటేష్(ఫైల్)

కొత్తకోట రూరల్: జాతీయ రహదారిపై ఈనెల 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వనపర్తి మండలంలోని కడుకుంట్ల గ్రామానికి చెందిన చందుకుమార్(19)బైక్‌పై వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన వెంకటేష్(59) మరో బైక్‌పై ఎదురుగా వస్తూ ముమ్మళ్లపల్లి జాతీయ రహదారి44పై ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో చందుకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయాలైన వెంకటేష్‌ను వనపర్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. వెంకటేష్‌కు భార్య బాలకిష్టమ్మ, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ..


లాస్య (ఫైల్)

బాలానగర్: విద్యుదాఘాతంతో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని మోతీఘణాపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. బాలానగర్ మండలంలోని మోతీఘణాపూర్‌కు చెందిన మేకల లాస్య ఇంట్లో టీవీ ప్రసారం కోసం ఏర్పాటు చేసిన టీవీ కేబుల్‌ను పక్కకు తీయబోయి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త మేకల శ్రీను ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ కేసులో మూడేళ్ల జైలుశిక్ష

వనపర్తి: చోరీ కేసులో ఓ నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ. వెయ్యి జరిమానా పడింది. ఈ మేరకు సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి తీర్పు వెలువరించినట్లు ఎస్పీ రక్షితా కె. మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలిలా.. గోపాల్‌పేటలోని ఓ కిరాణం షాపులో గత సంవత్సరం ఆగస్టులో చోరీ జరిగింది. ఘటనపై పోలీసులు కేసునమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడు పిచ్చకుంట్ల వెంకటేష్‌ను కోర్టులో హాజరుపరిచారు. కాగా సమగ్ర విచారణ తర్వాత తీర్పు వెలువడిందని ఎస్పీ వివరించారు.

బాధ్యులెవరు..?

- మాయల మాంత్రికుడి బాగోతాలను వెలుగులోకి తెస్తున్న బాధితులు
- ఇప్పటివరకు 11 మందిని పొట్టనబెట్టుకున్న సత్యనారాయణయాదవ్
- ఎట్టకేలకు నిందితుడికి సహకరించిన సీఐ హన్మంతుపై సస్పెన్షన్ వేటు
- సత్యనారాయణతో సీఐ సంబంధాలపై గతంలోనే వెల్లడించిన 'సాక్షి'

సాక్షి, నాగర్‌కర్నూల్: మంత్రాలు, మాయల పేరుతో 11 మంది అమాయకులను హత్యచేసిన మాయగాడు సత్యనారాయణయాదవ్ ఉదంతంలో మరింత మంది బాధితులు వెలుగులోకి వస్తున్నారు. నిందితుడు సత్యనారాయణకు సహకరించిన అప్పటి నాగర్‌కర్నూల్ సీఐ జక్కుల హన్మంతును ఇటీవల పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వ్యక్తి హత్యకేసులో నిందితుడికి సీఐ హన్మంతు సహకరించినట్టుగా తేలిందని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రకటించారు. నిందితుడు సత్యనారాయణ యాదవ్ బాగోతాలను వెలుగులోకి తెస్తూ గత ఏడాది ఏప్రిల్ 5న 'మాయగాళ్లు' శీర్షికన 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. ఇందులో నిందితుడు సత్యనారాయణకు సదరు పోలీస్ అధికారి సహకరించిన వైనాన్ని సైతం ప్రస్తావించింది. నిందితుడు సత్యనారాయణయాదవ్ మాయలు, హత్య ఉదంతాలపై సాక్షి ప్రచురించిన వరుస కథనాల నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. గతేడాది డిసెంబర్‌లో నిందితుడిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితుడికి సహకరించడంలో సీఐ హన్మంతు పాత్రపై విచారణ జరిపిన పోలీస్‌ఉన్నతాధికారులు శనివారం ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సాక్షిలో ప్రచురించిన కథనాలు..


కందనూలులో కలకలం


గుప్తనిధుల పేరుతో గాలం

నిర్లక్ష్యంతో అమాయకులు బలి..

నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన రామటి సత్యనారాయణయాదవ్ కొన్నేళ్లుగా తనకు మాయాలు, మంత్రాలు తెలుసునని అమాయకులను నమ్మించేవాడు. తన మంత్రశక్తితో గుప్తనిధులను వెలికితీస్తానంటూ ఆశచూపి వారి పేరిట ఉన్న ఆస్తులను తన పేరిట రాయించుకున్నాడు. ఆ తర్వాత వారిని గుప్తనిధులను వెలికితీసేందుకు అని చెప్పి నిర్మానుష్య ప్రాంతాలకు రప్పించి కిరాతకంగా హత్యలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో పలువురు పోలీస్ అధికారులను మచ్చిక చేసుకొని బహిరంగంగా దందా నడిపిస్తున్న సత్యనారాయణ యాదవ్ బాగోతాలపై గత ఏడాదిలో ఏప్రిల్‌లోనే 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. 2020 ఆగస్టు 14న వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లోని ఇంట్లో గుప్తనిధుల తవ్వకాల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు హత్యకు గురయ్యారు. రెండేళ్ల కిందట నాగర్‌కర్నూల్ మండలం గన్యాగులకి చెందిన లింగస్వామిని సైతం దారుణహత్యకు గురయ్యాడు. ఆ తర్వాత కోడేరు మండలం తీగలపల్లికి చెందిన రాంరెడ్డి, కల్వకుర్తి పట్టణానికి చెందిన వ్యక్తి, వనపర్తి జిల్లా పెద్దమందడి/వీపనగండ్ల మండలానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి వెంకటేశ్ సైతం కనిపించకుండా పోయాడు. అయితే 'సాక్షి' కథనం ప్రచురించిన సమయంలోనే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని ఉంటే నలుగురు ప్రాణాలు మిగిలేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. నిందితుడు సత్యనారాయణతో అంటకాగిన మిగితా అధికారులపై సైతం విచారణ జరుపాలన్న డిమాండ్ వినిప్తోంది.

గతంలోనూ వివాదాస్పదమే..

నాగర్‌కర్నూల్ సీఐగా పనిచేసిన హన్మంతు గతంలో జోగుళాంబ గద్వాల జిల్లాలోనూ పనిచేశారు. నాలుగేళ్ల కిందట గద్వాల పట్టణ శివారులోని రేఖ రైస్‌మిల్లులో పట్టుబడిన 170.5 క్వింటాళ్ల రేషన్‌బియ్యం బాగోతంలో సీఐ హన్మంతుతో పాటు ఇతర అధికారుల పాత్రపై 'సాక్షి' వరుస కథనాలను ప్రచురించింది. దీంతో సదరు ఘటనపై విచారణ చేపట్టిన రాష్ట్రస్థాయి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ పూర్ణచందర్ రావు ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ ఘటనలో ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్టు గుర్తించడంతో పాటు సీఐ హన్మంతు పాత్రపై నివేదికలో స్పష్టం చేసింది. తర్వాత నాగర్‌కర్నూల్‌కు బదిలీ అయిన హన్మంతు నిందితుడు సత్యనారాయణయాదవ్‌కు సహకరించిన నేపథ్యంలో ఇటీవల సస్పెన్షన్‌కు గురయ్యారు.

సీనియర్ నేషనల్ గో పోటీల్లో కాంస్య పతకం


నవీన్ చౌహాన్‌కు పతకం అందజేస్తున్న నిర్వాహకులు

మహబూబ్‌నగర్ క్రీడలు: బీహార్‌లో ఈనెల 28 నుంచి మంగళవారం వరకు జరిగిన సీనియర్ నేషనల్ గో చాంపియన్‌షిప్‌లో జిల్లా క్రీడాకారుడు నవీన్ చౌహాన్ ప్రతిభ చాటాడు. మూడోస్థానం కోసం జరిగిన పోటీల్లో నవీన్ సమాన పాయింట్లు సాధించి చత్తీస్‌ఘడ్ క్రీడాకారుడితో కలిసి సంయుక్తంగా కాంస్య పతకాన్ని పంచుకున్నాడు. ఈ సందర్భంగా గో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు నసరుల్లా హైదర్, సీనియర్ ఉపాధ్యక్షుడు మహ్మద్ షకీల్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి గులాం అఫ్రోజ్ హర్షం వ్యక్తం చేశారు.

నర్సాయపల్లిలో 'నగారా' షూటింగ్


'నగారా' చిత్రం షూటింగ్‌లో ఓ సన్నివేశం

బల్మూర్: పాలమూరు యాస, భాషతో తెలంగాణ పల్లె సంప్రదాయాలను ప్రతిబింబించేలా తీస్తున్న పూర్తి పల్లెటూరి కథ చిత్రం 'నగారా' షూటింగ్ బల్మూర్ మండలం నర్సాయపల్లిలో సాగుతోంది. కొంతకాలంగా గ్రామంలో చిత్రీకరణ సాగుతోందని త్వరలోనే పూర్తవుతుందని దర్శకుడు దర్శన్ 'సాక్షి'తో మంగళవారం తెలిపారు. ఈ చిత్రానికి దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్, సాంగ్స్, స్టోరీ, పాటలు అన్ని తానే నిర్వహిస్తున్నట్లు వివరించారు. తొలి సారిగా పాలమూర్ యాస, భాషతో నిర్మిస్తున్న ఈచిత్రంలో హీరోగా సిద్ధు, హీరోయిన్‌గా పూజ నటిస్తున్నారని చెప్పారు. త్వరలోనే చిత్ర నిర్మాణం పూర్తి చేసుకొని ఆడియో, వీడియో రిలీజ్ ఫంక్షన్ చేపట్టనున్నట్లు తెలిపారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌తో ఉద్యోగావకాశాలు


సర్టిఫికెట్లు ప్రధానం చేస్తున్న ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ

జడ్చర్ల టౌన్: కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవడం వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని జడ్చర్ల బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియాచిన్నమ్మ అన్నారు. మంగళవారం కళాశాల సమావేశ మందిరంలో తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్, కెరియర్ గైడెన్స్ సెల్, ఎంటర్ ప్రినర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సంయుక్త ఆధ్వర్యంలో 'క్యాంపస్ టు కార్పొరేట్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ రంగంలో కంటే ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. నిరుద్యోగ యువత కమ్యూనికేషన్ స్కిల్స్‌లో పట్టు సాధించాలని సూచించారు. అనంతరం హిందూస్థాన్ కోకాకోల బేవరేజెస్ ప్రతినిధి బోధిసత్వ పలు అంశాలపై అవగాహన కల్పించారు. పలువురు విద్యార్థులకు సర్టి ఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నాలెడ్జ్ సెంటర్ రీజినల్ మేనేజర్ సిరాజ్, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కోఆర్డినేటర్లు యాద య్య, మంజుల, అధ్యాపకులు సుభాషిణి, వీరప్రతాప్, మాధవి, అనిత, భార్గవి పాల్గొన్నారు.

చేతబడి నెపంతో మహిళను కొట్టి చంపిన దాయాదులు

మహబూబ్‌నగర్ రూరల్: చేతబడి చేస్తుందనే నెపంతో ఓ మహిళను దాయాదులు కర్రలతో కొట్టి చంపిన ఘటన మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని కోటకదిరలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మేకల నాగమ్మ (40)పై వైరం పెంచుకున్న దాయాదులు సోమవారం రాత్రి ఆమెతో అకారణంగా గొడవపడి ఇష్టానుసారంగా కాళ్లు, చేతులతో పాటు కర్రలతో ఆమెను చితకబాదారు. దాంతో ఆమె స్పృహతప్పి అక్కడికక్కడ పడి చనిపోయింది. పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని బాడాల సత్తయ్య, బాడాల చంద్రమ్మ, దేవరకద్ర మండలం గద్దెగూడెం గ్రామానికి చెందిన చెన్నగళ్ల నర్సమ్మలు మృతురాలిపై చేతబడి నెపం మోపి దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హత్య చేశారని ఆమె కుమార్తె మేకల అచ్చమ్మ మంగళవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ మృతి సంఘటన గ్రామంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దాంతో గ్రామంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

జాతీయ సదస్సుకు రామకృష్ణాపురం హెచ్‌ఎం



కొత్తకోట రూరల్: జాతీయ విద్యావేత్తల సదస్సుకు మండల పరిధిలోని రామకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం మురళీకృష్ణ ఎంపికయ్యారు. భోపాల్‌లోని పండిట్ సుందర్ లాల్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1, 2వ తేదీల్లో సదస్సు జరగనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. వారి పరిశోధన పత్రాలను వృత్తి విద్య, శిక్షణలో దృక్పథం అభ్యాసాలపై సమర్పించనున్నారు. మురళీకృష్ణ వెదురుతో చేసిన బొమ్మలు, బోధనోపకరణాలు, ఆటలను పాఠశాల స్థాయిలో ప్రవేశపెట్టి విద్యార్థుల అభివృద్ధికి ఎలా కృషిచేయాలనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించనున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు పేరు తేవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఈఓ గోవిందరాజులు ఆయనను అభినందించారు.

గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ బ్రోచర్ ఆవిష్కరణ


టోర్నీ బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ క్రీడలు: జీబీపీఎల్ స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ జాతీయ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్లను మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. జీబీపీఎల్ స్పోర్ట్స్ సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ సద్గురు సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని పురస్కరించుకొని గోర్ బంజారా ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నీలో పాల్గొనే జట్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని, మిగతా వివరాలకు 9032860912, 9010322645 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్టీసెల్ వైస్ చైర్మన్ శేఖర్ నాయక్, గోవర్ధన్ నాయక్, ఢాక్యానాయక్, ప్రవీణ్‌కుమార్, రాజు. జీబీపీఎల్ టోర్నమెంట్ చైర్మన్ రామావత్ రవిరాథోడ్, చందర్ రాథోడ్, బిచ్యానాయక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యాన్ని నియంత్రించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ జి.రవినాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కాలుష్య నియంత్రణ మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలుష్యంతో వ్యవసాయ పొలాలు, జంతువులు వంటి వాటికి హాని కలగకుండా చూడాలన్నారు. జడ్చర్ల సమీపంలోని పోలేపల్లి సెజ్‌లో ఉన్న పరిశ్రమలను క్రమం తప్పకుండా తనిఖీ చేసి, ప్రతినెలా 12న నివేదిక ఇవ్వాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన తాగు నీటిని మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేసేందుకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ నీటిని చెరువులు, ఇతర ప్రాంతాల్లోకి వెళ్లకుండా ఏ రోజుకారోజు ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించాలని ఆదేశించారు. వృథా నీరు వెళ్లేందుకు ప్రత్యేక కెనాల్ నిర్మించాలని తెలిపారు. భూగర్భజలాలు కలుషితం కాకుండా కాలుష్య నియంత్రణ మండలి సరైన ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. పంటలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. జిల్లా పరిశ్రమల మేనేజర్ బాబూరావు, కాలుష్య నియంత్రణ మండలి సహాయ పర్యావరణ శాస్త్రవేత్త విద్యులత, డీఎంహెచ్ఓ కృష్ణ, మత్స్య శాఖ ఏడీ రాధారోహిణి, వ్యవసాయాధికారి వెంకటేశ్, గ్రౌండ్ వాటర్ డీడీ రాజేందర్ ఉన్నారు.

సాంకేతిక ఉద్యానవనం సందర్శన


సాంకేతిక ఉద్యానవనంలో విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు మంగళవారం హైదరాబాద్‌లో సాంకేతిక ఉద్యానవనాన్ని సందర్శించారు. ఈసందర్భంగా నూతన నిర్మాణ పద్ధతులు, పాడైపోయిన పండ్లు ఇతర కూరగాయల నుంచి రంగులు, కాగితం, సంపీడన బ్లాక్ ఇటుకలు, బయోఫ్యూయెల్, వర్మి కంపోస్టు తయారీ విధానాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆస్పత్రిని సందర్శించిన ఢిల్లీ బృందం


వివరాలు తెలుసుకొంటున్న వైద్యబృందం

నవాబుపేట: మండల పరిధిలోని రుద్రారంలో ఆయుష్మాన్ ఆస్పత్రిని ఢిల్లీ వైద్యబృందం మంగళవారం పరిశీలించింది. ఆస్పతిలో నాణ్యతా ప్రమాణాలు, ఆసుపత్రిలోని నాణ్యత ప్రమానాలు, సౌకర్యాల కల్పన, కావాల్సిన సదుపాయాలపై ఈ ప్రత్యేక బృందం క్షేత్రస్థాయి పరిశీలన చేసింది. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరాతీసింది. కావాల్సిన అదనపు సిబ్బంది తదితర వివరాలు తెలుసుకున్నారు. పలుసూచనలు చేశారు. కాగా ఏర్పాటు చేయాల్సిన అదనపు వసతులపై నివేదిక ఇస్తామని బృందం వివరించింది. ఈ సందర్భంగా నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేసింది. అనంతరం రుద్రారం సర్పంచ్ లలితమ్మ, మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌చందర్ బృందాన్ని ఘనంగా సన్మానించారు. బృందంలో డాక్టర్ సంగీత్‌సేన్, డాక్టర్‌శాలీని చావ్లా తదితరులు ఉన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పీయూ జట్టు


టేబుల్ టెన్నిస్ జట్టుతో పీయూ వీసీ, రిజిస్ట్రార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇంటర్ యూనివర్సిటీ టేబుల్ టెన్నిస్ పోటీలకు పీయూ జట్టు మంగళవారం బయల్దేరింది. చెన్నైలోని అంబేడ్కర్ లా యూనివర్సిటీలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో జట్టు పాల్గొననుంది. ఈ సందర్భంగా క్రీడాకారులకు పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజ ట్రాక్ సూట్లు పంపిణీ చేశారు. పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వివాదాస్పద భూములపై విచారణ


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వీపనగండ్ల: వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలంలోని మూడు గ్రామాల రైతుల మధ్య వివాదాస్పదంగా మారిన భూములను మంగళవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పరిశీలించి, విచారణ నిర్వహించారు. గోపల్‌దిన్నెలోని సర్వే నంబర్ 357లో 351 ఎకరాల 36 గుంటల ప్రభుత్వ భూమిని గతంలో గోపల్‌దిన్నె, రంగవరం, పుల్గర్‌చర్ల గ్రామాల రైతులకు కేటాయిస్తూ, రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. ఈ పట్టాలపై వివాదం నెలకొనగా.. పలుమార్లు రెవెన్యూ అధికారులు రైతుల వివరాలు సేకరించి విచారణ జరిపారు. గోపల్‌దిన్నెకు చెందిన పలువురు రైతులకు పట్టాలు ఉన్నా మోకాపై భూమి లేకపోవడం.. రంగవరం రైతులు తక్కువ భూమికి పట్టాలు ఉండి, ఎక్కువ భూమిని సాగు చేస్తున్నారన్న వివాదం కొనసాగుతోంది. సమస్య పరిష్కారానికి కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. రైతుల ఒరిజినల్ పట్టా పత్రాలను పరిశీలించారు. రెండు రోజులపాటు రెవెన్యూ అధికారులు గ్రామంలోనే ఉండి పూర్తి స్థాయిలో విచారణ నిర్వహిస్తారని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ పద్మావతి, తహసిల్దార్ వరలక్ష్మి, పెబ్బేరు డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, ఆర్ఐ కురుమూర్తి, సర్వేయర్ చెన్నయ్య ఉన్నారు.

పోలీస్‌స్టేషన్ వద్ద రైతు ఆత్మహత్యాయత్నం

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద ఓ రైతు ఆత్మహత్యకు యత్నించాడు. వివరాల్లోకి వెళ్తే.. తెలకపల్లి మండలం గౌతంపల్లికి చెందిన రైతు కాటమోని మల్లేష్ ఇటీవల పొలం పనుల్లో ఉండగా.. పక్క పొలం రైతు పశువులు వచ్చాయి. వాటిని అక్కడి నుంచి పంపించే క్రమంలో మిరప పంటలో పడ్డాయి. దీంతో పంట పాడైందని బాధిత రైతు మల్లేష్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి, గొడవలు పడకుండా పెద్దల సమక్షంలో మాట్లాడుకోవాలని సూచించారు. ఈక్రమంలో ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డితో పాటు పక్క పొలం వారు తనను దూషించారని పేర్కొంటూ రైతు మల్లేష్ పురుగు మందు తాగాడు. గమనించిన పోలీసులు వెంటనే 108 అంబులెన్స్‌లో అతడిని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈవిషయమై ఎస్ఐ రామేశ్వర్‌రెడ్డిని వివరణ కోరగా.. పొలంలో పశువులు మేశాయన్న కారణంతో గొడవలు పడొద్దని సూచించనని, అతడిని దూషించలేదని తెలిపారు.

బైరోజు రాజశేఖర్‌కు ఘన సన్మానం



జోగుళాంబ శక్తిపీఠం: గుంటూరు జిల్లా కేంద్రంలోని తెలుగు కావ్యమథనము–సాహితీ బృందం (పూసపాటి పద్యపాఠశాల) ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం జరిగాయి. వేడుకల్లో అలంపూర్‌కు చెందిన బైరోజు రాజశేఖర్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కాగా వేడుకలను పురస్కరించుని ఇటీవల వివిధ అంశాల పైన సీస పద్యాల విభాగం, తేటగీతి పద్యాల విభాగంలో పోటీలు నిర్వహించగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 100కు మంది పైగా కవులు, రచయితలు పాల్గొన్నారు. అలంపూర్ ప్రభుత్వ పాఠశాల నుంచి బైరోజు జోగుళాంబపై ...'' జోతలందుకో మాయమ్మ జోగుళాంబ'' మకుటంతో తేటగీతి విభాగంలో 11 పద్యాలను రాసి పంపారు. దీంతో రాష్ట్రస్థాయిలో తేటగీతి విభాగంలో ఆయనకు రెండో బహుమతి వచ్చింది. ఈ మేరకు ఆయన వేడుకల్లో సత్కారం పొందారు. సాహితీ సమూహ వ్యవస్థాపకులు పూసపాటి కృష్ణకుమార్, నిర్వాహకులు రామకృష్ణ, వట్టెం వెంకటరమణ, యలపర్తి సాయి సతీష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా ఉమ్మడి మహబూబ్‌నగర్ నుంచి ఇద్దరు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

డిజిటల్ మార్కెటింగ్‌లో ఉద్యోగ అవకాశాలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: డిజిటల్ మార్కెటింగ్‌లో అనేక ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అన్నారు. పీయూలో మంగళవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల సాధనకు డిజిటల్ మార్కెటింగ్ మంచి ప్లాట్‌ఫాం అని అన్నారు. వివిధ సైట్‌ల ద్వారా ఉద్యోగాలను పొందేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థులు డిజిటల్ మార్కెటింగ్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. అధ్యాపకులు అర్జున్, నాగసుధ, జావీద్ అహ్మద్, అరుంధతిరెడ్డి, రాకెస్సీజాయ్, విజయ్ పాల్గొన్నారు.

మరణంలోనూ వీడని స్నేహం

- కారు, బైక్ ఢీకొని ఇద్దరు స్నేహితుల దుర్మరణం


బాల్‌రాజు, ప్రభాకర్ (ఫైల్)

మక్తల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులు దుర్మరణం చెందారు. ఈ విషాదకర ఘటన మక్తల్ మండలం కాచ్వార్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మక్తల్‌కు చెందిన బాల్‌రాజు అలియాస్ భాను (35), ప్రభాకర్ (34) స్నేహితులు. వీరిద్దరు స్థానికంగా ఓ ప్రైవేటు డాక్టర్ వద్ద 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. వీరిద్దరు కలిసి బైక్‌పై కాచ్వార్‌వైపు వస్తుండగా.. హైదరాబాద్ నుంచి రాయచూరు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో వారికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక మార్చురీకి తరలించారు. బాల్‌రాజుకు భార్య మమత, ముగ్గురు పిల్లలు ఉండగా.. ప్రభాకర్‌కు భార్య రాధ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఇసుక డంపుల సీజ్

ఉప్పునుంతల: పెద్దాపూర్ శివారులో అక్రమంగా నిల్వచేసిన ఇసుక డంపులను తహసీల్దార్ తబితారాణి ఆదేశాల మేరకు ఎమ్మార్ఐ సుజాత పంచనామా నిర్వహించి మంగళవారం సీజ్ చేశారు. ఇందులో పెద్దాపూర్‌లో రవీందర్‌రావు, దేవేందర్‌రావు, రాములుగౌడ్, నిరంజన్‌లకు చెందిన 50 ట్రిప్పులు (ట్రాక్టర్లు) అక్రమ ఇసుక ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వెంకటేశ్వర్‌రావు పొలంలో రమేష్ డంపుచేసిన 25 ట్రిప్పుల ఇసుకను, మొల్గరకు చెందిన శ్రీరాములుగౌడ్ తన పొలంలో డంపు చేసిన 8 ట్రిప్పుల ఇసుకను సీజ్ చేశామని వివరించారు. సీజ్ చేసిన డంపుల నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.